17న సేవ్ ఎర్త్..నోవార్ ర్యాలీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : భూమాతను రక్షించుకోవాల్సిన ఆవశ్యకత, యుద్ధాల వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 17న పట్టణంలో తలపెట్టిన సేవ్ ఎర్త్.. నోవార్ ర్యాలీని జయప్రదం చేద్దామని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని పరిణయ ఫంక్షన్ హాల్‌లో ప్రయివేటు పాఠశాలల కరస్పాండెంట్లు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్‌తో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం విపరీతంగా పెరిగిపోయిన సాంకేతిక పరిజ్ఞానం వల్ల లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న వాతావరణ కాలుష్యంతో మానవాళి మనుగడకు ముప్పు ఏర్పడుతోందన్నారు. యుద్ధాల వల్ల అనేక నష్టాలు జరుగుతున్నాయని, ఇటీవల రష్యా, ఉక్రేయిన్ దేశాల మధ్య జరిగిన యుద్ధంలో వేలాది మంది మృతి చెందడం, అపార నష్టం వాటిల్లడమే ఇందుకు నిదర్శనమన్నారు. విజయభారతి హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు మాట్లాడుతూ ఓవైపు ప్రజా సమస్యల పరిష్కారానికి, మరోవైపు సమాజ శ్రేయస్సుకు దోహదపడే కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎమ్మెల్యే తన ప్రత్యేకతను చాటుకుంటున్నారన్నారు. 17వ తేదీన పట్టణంలోని టిప్పు సుల్తాన్ మైదానం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు జరిగే సేవ్ ఎర్త్..నోవార్ ర్యాలీలో అన్ని పాఠశాలలు, కళాశాల విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రోడ్లకు మోక్షం కలిగేనా..?

- రహదారులు గుంతలమయం
- రింగ్ రోడ్డు ఏర్పాటయ్యేనా?
- ప్రయాణికుల ఇక్కట్లు వర్ణనాతీతం
- ఆందోళనలో ప్రయాణికులు

ప్రజాశక్తి - రాయచోటి

ఐదేళ్లుగా రాష్ట్రంలోని రోడ్లన్నీ గుంతలమయమై ప్రయాణానికి వీలుకాకుండా ఉన్నాయి. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో రోడ్ల భవనాల శాఖ కార్యాలయానికి సంబంధించి 2,721 కిలోమీటర్లు రహదారులు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గుంతల రహదారులకు మరమ్మతుల కోసం జిల్లా వ్యాప్తంగా 1,444 కిలోమీటర్ల కోసం 153 పనులకుగాను రూ.14.65 లక్షలు టెండర్లు పిలిచారు. ఇప్పటి వరకు 1270 కిలోమీటర్లు రహదారులు పూర్తి చేసినట్లు రోడ్ల భవనాల శాఖ అధికారులు చెబుతున్నారు. జిల్లా కేంద్రం రాయచోటి-వేంపల్లి, రాయచోటి-రాజంపేట, రాయచోటి-సుండుపల్లి, దేవపట్ల-చిన్నమండెం వెళ్లే రహదారులు మరీ దారుణంగా ఉన్నాయి. రాయచోటి-వేంపల్లి రహదారి పనులు నేషనల్ హైవే వారు పనులు చేపడుతున్నారు. పనులు నత్తనడకన సాగుతూ ఉండడంతో అక్కడ ప్రయా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మిగిలిన ప్రాంతాలకు గతంలో రోడ్డు నిర్మాణ పనులకు దక్కించుకొన్నారు. బిల్లులు సకాలంలో రాకపోవడంతో పనులు ఆపివేశారు. అర్ధదారులలో ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. మరీ ముఖ్యంగా రాత్రిపూట ద్విచక్ర వాహనదారులు రోడ్లపై ప్రయాణిస్తూ గుంతల్లో పడి గాయాల పాలవుతున్నారు. కొత్తగా ఏర్పడ్డ కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లను పూడ్చివేసేందుకు రూ.కోట్లు వెచ్చించి ప్రయాణికులు కష్టాలు తీరుస్తామని హామీ ఇచ్చారు. అ ఇచ్చిన మాట ప్రకారం అన్ని ప్రాంతాలలో పూడ్చే కార్యక్రమం చేపట్టారు. మిగిలిన ప్రాంతాలలో రోడ్లు గుంతలుగా ఉండడంతో ప్రయాణికులకు ఇబ్బంది తప్పడం లేదు. వర్షం వస్తే రోడ్డుపై నీరు నిల్వ ఉండడం వల్ల ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురుతున్నారు.

రింగ్ రోడ్డుకు మోక్షమెప్పుడో?

2008వ సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో రాయచోటికి రూ.3,900 కోట్లతో రింగు రోడ్డుకు టెండర్ల పిలిచి పనులను ప్రారంభించారు. రోడ్డు పనులు ఇప్పటివరకు పనులు పూర్తి కాక పోవడం శోచనీయం. కడప-చిత్తూరు రింగ్ రోడ్డు మార్గమధ్యలోని చెన్నముక్కపల్లి, రవాణా కార్యాలయం వద్ద రింగ్ రోడ్డు పనులు నిలిచిపోయాయి. అక్కడ ఉన్న రైతులు నష్టపరిహారం ఇవ్వనందున వారు కోర్టును ఆశ్రయించారు. వారికి కావాల్సింది నష్టపరిహారాన్ని ఇవ్వలేక ఆ పనులన్నీ నిలిచిపోయాయి. రహదారిలో వెళ్లాలంటే ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. రూ.450 లక్షలు రింగ్ రోడ్డు పనుల కోసం బడ్జెట్ మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు. రూ.300 లక్షలు అక్కడ ఉన్నటువంటి బాధితులకు, మిగిలినవి కోట్లు మరమ్మతుల కోసం మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు. రింగ్ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో గుంతలు, దుమ్ముతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చివేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు కోరుకుంటున్నారు.

శిబ్యాల దళితవాడ దగ్గర ఆగిన వంతెన పనులు

అధ్వాన్నంగా సుండుపల్లె-రాయచోటి రోడ్డు

రోడ్డు పనులు పూర్తిచేయాలి

రాయచోటి-సుండుపల్లె మండల కేంద్రానికి మొదలు పెట్టిన డబుల్ లైన్ రోడ్డు పనులు పూర్తి చేయాలి. రాత్రివేళలో ప్రయాణించాలంటే భయమేస్తుంది. ప్రమాదాలు జరగక ముందే, మరిన్ని ప్రాణాలు కోల్పోక ముందే సత్వరం పూర్తి చేయాలి. గత ప్రభుత్వాలు లాగే నిర్లక్ష్యం వహించకుండా అత్యంత వేగవంతంగా రోడ్డు పనులు పూర్తి చేయాలి.

- యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, సుండుపల్లె.

త్వరలో పూర్తి చేస్తాం

జిల్లాలో ఉన్న రహదారులు, నిలిచిపోయిన గుంతలు పనులను త్వరలో పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. గుంతల పూడ్చడానికి చేసే పనులకు వెంటనే బిల్లులు చెల్లిస్తున్నాం. రాయచోటి-రాజంపేట, రాయచోటి-సుండుపల్లె, దేవపట్ల-చిన్నమండెం గతంలో బిల్లులు ఆలస్యం కావడంతో పనులు ఆగాయి. మిగిలిన పనులను కూడా కాంట్రాక్టర్ల తో మాట్లాడి త్వరలో రహదారుల పనులు పూర్తిచేస్తాం.

- సహదేవరెడ్డి, ఆర్అండ్‌బి ఎస్ఇ, రాయచోటి.

ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

- మంత్రులు టి.జి.భరత్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి- రాయచోటి

ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టి.జి.భరత్, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని గాంధీ బజార్‌లో ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టి.జి.భరత్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్యవైశ్యుల సంక్షే మానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. గతంలో ఆర్యవైశ్యులను పట్టిం చుకునే వారే లేరని టిడిపి ప్రభుత్వంలో ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. వీరి అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించేందుకు ప్రభుత్వంతో చర్చిస్తామని చెప్పారు.గత ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు పలు రకాలుగా ఇబ్బందులు పడి ఎంతో నష్టపోయారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కుల, మత ప్రాంత భేదాలు లేకుండా అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాంప్రమాద్‌రెడ్డి మాట్లాడుతూ టి.జి.భరత్ పిలవంగానే రాయచోటి పట్టణానికి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజులలో ఇలాంటి మంచి కార్యక్రమాలు ఆయన చేతుల మీదుగా మరిన్ని ప్రారంభించాలని కోరుకుంటున్నానన్నారు. గాంధీబజార్‌లో ఎక్కువ మంది ఆర్యవైశ్యులు ఉన్నారని, ఎటువంటి సమస్యలున్న తమ దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవచ్చని చెప్పారు. రాబోయే రోజులలో రాయచోటి పట్టణాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని ఇందుకు ప్రతి ఒక్కరు పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో జీవిస్తున్నారని ఇలాంటి ప్రభుత్వం పది కాలాలపాటు ఉండేందుకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయాన్ని మంత్రివర్యులు ప్రారంభించారు.

మంత్రులు టి.జి.భరత్, రాంప్రసాద్‌రెడ్డికి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆర్యవైశ్యులు

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

అర్జీదారులతో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తుందని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని తెలిపారు. అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలని పేర్కొన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించిన కలెక్టర్ ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీదారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు, ఎస్‌డిసి రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

14న పిడిఎస్‌యు విలీన సభ

ప్రజాశక్తి- రాయచోటి

పిడిఎస్‌యు విలీన సభను ఈ నెల 14న నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.అంకన్న పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1974 అక్టోబర్ 12న హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా ఏర్పడిన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్‌యు తన 50 ఏళ్ల అర్ధ శతాబ్ద ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందన్నారు. 2013లో రెండుగా చీలిన పిడిఎస్‌యు, ప్రస్తుతం రెండు కార్యవర్గాలు నెల్లూరు నగరంలో ఈనెల 14న విలీన సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. పిడిఎస్‌యు సంఘం చరిత్రలో ఇదిక చారిత్రాత్మకమైన సందర్భం అన్నారు. ఈ ఐక్యత దేశంలో ఉన్న మరిన్ని విప్లవ విద్యార్థి సంఘాల ఐక్యతకు తోడ్పాటున అందిస్తుందన్నారు. నెల్లూరు నగరంలో నిర్వహించే విలీన సభకు విద్యావంతులు, మేధావులు, విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు అమీర్, సాయి నాయక్, రమణ, ఖాదర్ బాషా, చిన్నారెడ్డి, భాస్కర్, గంగాధర్ పాల్గొన్నారు.

సర్వజన బోధన ఆస్పత్రిలో తనిఖీలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సర్వజన బోధనాస్పత్రిని సోమవారం ఎపిఎంఎస్ఐడిసి బృందం తనిఖీ చేసింది. గుంటూరు జిల్లా మంగళగిరి నుంచి వచ్చిన ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, ఎపిఎంఎస్ఐడిసి కమిటీ సభ్యులు మదనపల్లె సర్వజన బోధనాసుపత్రిలోని మెడికల్ కాలేజీలో వివిధ బ్లాకులలో అమలు చేయబడిన పనుల ఫోటోలు, వీడియోలను తీయించారు. కాంట్రాక్టర్‌తో కలిసి కాలేజి నిర్మాణ భౌతికతను నిర్వహించి తగు నివేదికను, కాలేజీలో జరిగిన నాణ్యత ప్రమాణాలు, ఇక్కడ కాలేజీ నెలకొల్పడానికి అనువుగా సదుపాయాలు బాగున్నాయా లేదా అని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తున్నట్లు తెలిపారు.

మెడికల్ కాలేజ్‌లో పర్యటిస్తున్న బృందం

మీనాక్షి ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

మీనాక్షి ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా

ప్రజాశక్తి-మదనపల్లి

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. పట్టణంలో సొసైటీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మీనాక్షి మల్టీ స్పెషాలిటీ సూపర్ ఆస్పత్రిని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ప్రజలకు సేవాభావంతో సేవలందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ జి.మల్లికార్జున, డాక్టర్ ఎం.వి.సాయి నిహారిక మాట్లాడుతూ పట్టణంలో రెండు సంవత్సరాలుగా ఉత్తమమైన సేవలందించి ప్రజలకు దగ్గరయ్యామన్నారు. నేడు నూతన భవనంలో మరింత మెరుగైన వైద్యం అందించాలని ప్రారంభించామన్నారు. 24 గంటలు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పారు. అధునాతన మైన శస్త్రచికిత్సలు, ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసియు), ఆక్సిజన్, ఫిజియోథెరపీ, డయాలసిస్ వంటి వైద్యసేవలు అధునాతన పద్ధతిలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రజలకు అధునాతన, మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆస్పత్రి ప్రారంభించామన్నారు. మదనపల్లి పరిసర ప్రజలకు సమర్థవంతమైన వైద్యసేవలు అందించడం, సమీప గ్రామాల్లోనూ ప్రజల ఆరోగ్యంపై అవగాహన కల్పించడం మా ఏకైక లక్ష్యమన్నారు. మా ఆస్పత్రిలో పేదలకు అందుబాటులో వైద్య సేవలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని వైద్యులు, జనసేన నాయకులు శ్రీరామ రామాంజనేయులు, బలిజ సేవా సమితి నాయకులు బిపిఎల్ విజయ్ కుమార్, రాజ్ భవన్ రాజా, బెల్లె రెడ్డి ప్రసాద్, జంగాల శివరాం, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రాధామణికి నంది అవార్డు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి టౌన్ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సభ్యురాలు, ప్రధానోపాధ్యాయులు నాగపట్నం రాదామణికి జాతీయ స్థాయి నంది అవార్డు దక్కింది. పట్టణానికి చెందిన రాధామణి పుంగనూరు మండలం, కాపాడమెట్టపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఐద్వాలో సభ్యురాలుగా ఉంటూ సమాజం కోసం ఎన్నో సేవ కార్యక్రమాలు చేపట్టారు. ఆమె సేవలను గుర్తించిన జాతీయ స్థాయి గుర్తింపు పొందిన తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ వారు త్యాగరాయగాన సభ హైదరాబాద్‌లో నంది అవార్డు ప్రధానం చేశారు. 2024, అక్టోబర్ 26న చెన్నై యూనివర్సిటీ వారు రాధామణి సేవలకు గాను డాక్టరేట్ ప్రధానం చేశారు. పేద పిల్లలకు, అనాధాశ్రమాలకు సహాయ, సహకారాలు అందిస్తున్న రాధామణి మహిళా సంఘంలో చురుగ్గా పాల్గొంటూ, వారి సమస్యలపై పోరాటం చేస్తుంటారు. నంది అవార్డు, డాక్టరేట్ తీసుకున్న రాధామణికి మహిళా సంఘం తరపున మహిళా సంఘం జిల్లా కన్వీనర్ ఎం.భాగ్యమ్మ, సభ్యులు షాహినారెడ్డి, ప్రసన్న, అంజలి రేవతి, కమలమ్మ అభినందనలు తెలియజేశారు.

నంది అవార్డు అందుకుంటున్న రాధామణి

మహిళకు లైసెన్స్ పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

కల్లుగీత కులాలకు 11 మద్యం దుకాణాలు : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో కల్లుగీత కులాలకు 11 మద్యం దుకాణాలకు లాటరీ పద్ధతిలో పారదర్శకంగా లైసెన్స్ జారీ చేశామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను కలెక్టర్ లాటరీ తీశారు. లాటరీలో ఎంపికైన వారికి మద్యం దుకాణాల లైసెన్స్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కల్లుగీత వారికి సంబంధించి కేటాయించిన మద్యం షాపులకు ప్రభుత్వ నిబంధనల మేరకు జనవరి 27న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. జిల్లాలో మొత్తంగా 135 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కల్లుగీత సామాజిక వర్గంలో ఉప కులాలైన గౌడ్, ఈడిగ, గౌడ, గౌండ్ల నాలుగు ఉప కులాలకు బహిరంగంగా లాటరీ పద్ధతిలో రాయచోటి, మదనపల్లి, రాజంపేట మున్సిపాలిటీలు, మండలాలకు ఈ 11 దుకాణాలు కేటాయించారని చెప్పారు. ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా బహిరంగంగా ఆ వర్గాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న ప్రతినిధుల సమక్షంలో వీడియోగ్రఫీ చేస్తూ లాటరీ నిర్వహించామని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్, సహాయ సూపరింటెండెంట్ వై.జోగేంద్ర, ఇన్‌స్పెక్టర్లు యల్లయ్య, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రక్తదానం ప్రాణ దానంతో సమానమని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి నారాయణ తెలిపారు. ప్రాంతీయ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ నాగేశ్వరరాజు, వైద్యాధికారి శుభశ్రీ, అన్నమాచార్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో సోమవారం అన్నమాచార్య యూనివర్సిటీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ మానవ దేహంలో రక్తం అత్యంత కీలకమైన పదార్థమని, అత్యవసర సమయాలలో రక్తదార్థం కనుగొనడం చాలా కాలిష్టమైన అంశమని చెప్పారు. అందుకే రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. ప్రాంతీయ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ నాగేశ్వర రాజు మాట్లాడుతూ 18 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరు రక్తదానం చేయవచ్చునని, రక్తదానం చేసిన రెండు నుంచి మూడు రోజుల్లోనే మళ్లీ రక్తం పునరుత్పత్తి జరుగుతుందని, ఏడాదిలో కనీసం ఒక్కసారైనా రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునని తెలిపారు. అన్నమాచార్య ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఓబులపతి మాట్లాడుతూ విద్యార్థుల నుండి 102 రక్షణమూణాలు సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్నమాచార్య యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.మల్లిఖార్జున రావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రఘునాథ్, కడప రిమ్స్ ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

7వ జలాశయం గణనపై శిక్షణ

ప్రజాశక్తి - గాలివీడు

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం తహశీల్దార్ జె.భాగ్యలత అధ్యక్షతన విఆర్ఒలు, ఎఎస్ఒ నాగరాజు ఏడవ చిన్న తరహా నీటి వనరుల ఏడవ జలాశయం గణనపైన సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి చివరిలో గ్రామాలలో బోరు బావులు, చెరువులు, కుంటలు సర్వే చేసి నివేదికలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి వీటిపై గణన జరుగుతుందని పేర్కొన్నారు. 2023-24 గణన ప్రకారం సర్వే చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విఆర్ఒలు యశోద, భార్గవ, రవీంద్ర రెడ్డి, అలా బకాష్, వెంకటేశ్వర్లు, నిర్మల్ కుమార్, జయన్న, శేఖర్, సుధాకర్ పలువురు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ టెలికాం సభ్యుడిగా కరీముల్లా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా బిఎస్ఎన్ఎల్ టెలికాం సభ్యుడిగా నియమితులయ్యారు. గత ప్రభుత్వంలో చురుగ్గా పనిచేసిన కరీముల్లాను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి బిఎస్ఎన్ఎల్ టెలికాం సభ్యుడి పదవికి సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా కరీముల్లా మాట్లాడుతూ తనపై నమ్మకముంచి బాధ్యతలు అప్పగించిన రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన మాజీ సిఎం వై.ఎస్.జగన్, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్‌రెడ్డిలకు ధన్యవాదములు తెలిపారు. టెలికాం సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కరీముల్లాకు వైసిపి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

అనారోగ్యంతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : అనారోగ్యంతో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పుంగనూరు మండలం, రాజులూరికి చెందిన రైతు గోవర్ధన్ రాజు(55) కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులలో చూపించినా డబ్బు ఖర్చు తప్ప జబ్బు నయం కాలేదు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన గోవర్ధన్‌రాజు సోమవారం ఇంటివద్దే పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు రైతును జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రామాల అభివృద్ధి సాధనకై ప్రత్యేక కృషి చేస్తున్నామని, మాలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే ఎం.షాజహాన్ బాషా పేర్కొన్నారు. సోమవారం కొత్తవారిపల్లి పంచాయతీ, రెడ్డివారిపల్లెలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఆర్ఒ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి ప్రజలకు అంకితమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం చేతకాని విధానాలతో గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి పంచాయతీ రాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని, పంచాయతీ నిధులన్నీ పక్కదోవ పట్టించారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. సర్పంచ్‌లకే సర్వాధికారాలు ఇచ్చి పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకొస్తున్నారని కొనియాడారు. మదనపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, సంక్షేమ పథకాలు ప్రజలందరికీ సకాలంలో అందిస్తున్నామని తెలిపారు. సిసి రోడ్లు, మురుగునీటి కాలువలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు తొలి ప్రాధాన్యతనిస్తూ తగినన్ని నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. మున్ముందు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నవీన్ చౌదరి, రెడ్డి రాంప్రసాద్, చల్లా నరసింహులు, ప్రసాద్ నాయుడు, మిట్టపల్లి రాజు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పూత, పిందె దశల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-రామాపురం

మామిడిలో అధిక దిగుబడులు పొందాలంటే పూత, పిందె రాలిపోకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని లక్కిరెడ్డిపల్లి ఉద్యానవన శాఖ అధికారి టి. నాగమణి పేర్కొన్నారు. మండలంలోని హసనాపురం, రాచపల్లి గ్రామాల్లో మామిడి పూత, పిందె దశలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై సోమవారం రైతులకు అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చి పూత దశలో ఆశించే తెగులు నివారణకు భూ ప్రో ఫెజిన్ 1.5 మిల్లీలీటర్లు, కంటాఫ్2 మిల్లీలీటర్లు, ఆజాడిరెక్టిన్ 2 మిల్లీ లీటర్లు నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు. మామిడి నల్లపూత దశ అనగా పిందె బఠాణి గింజ సైజులో ఉన్నప్పుడు ఆశించే తెగుళ్ళ నివారణ అవుతుందని చెప్పారు. మామిడి పిందెలు గోలీకాయ, నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు 10 సంవత్సరాల పైబడిన చెట్లకు రెండవసారి ఎరువులను 15 రోజులకు ఒకసారి నీటితో తడపాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సహాయకులు అన్వర్, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వాడుదాం

ప్రజాశక్తి-రామాపురం

మనిషి ఆరోగ్యవంతమైన జీవితం గడపడానికి రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులకు దూరంగా ఉండి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వాడదామని తహశీల్దార్ రామాంజనేయులు, మండల వ్యవసాయ అధికారి వై.నాగమణి అన్నారు. మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలి వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ స్టాల్ ప్రతి సోమవారం మండల కేంద్రంలో అందుబాటులో ఉంటుందని చెప్పారు. మండల్ ఇన్‌ఛార్జ్ మధుకర్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఏ గ్రేడ్ మోడల్ ఎటిఎమ్, మోడల్ రైతులు పండించిన ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి కూరగాయలు మార్కెట్ చేశారు. జిల్లాలో మొత్తం 25 మండలాల్లో జిల్లా కలెక్టర్లో ఈ విధంగా రైతులకు ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందజేసే కార్యక్రమం డిపిఎం ప్రవీణ్ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు పవన్ తెలిపారు ఎంపిటి పద్మావతి ఎల్ వన్ వెంకటరామిరెడ్డి సుధాకర్ మండల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు తయారుచేసిన పప్పు దినుసుల ఆకారాలు

ఘనంగా ప్రపంచ పప్పు దినుసుల దినోత్సవం

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని దలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ పప్పు దినుసుల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు పేపర్ మీద వివిధ ఆకారాలతో పప్పు దినుసులు అమర్చి చాలా అందంగా తయారు చేశారు. భారతదేశ పటం, జాతీయ జెండా, పిల్లల గౌను, పువ్వులు, సూర్యుడు, రోబో, యాపిల్ వంటి ఆకారాలలో అమర్చిన పప్పు దినుసులు అమర్చారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ పప్పు దినుసులలో పోషక విలువలు మెండుగా ఉంటాయని చవకగా వస్తాయని నిలువ చేయడం సులభమని కుండే ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయని పేర్కొన్నారు. బరువు నిర్వహణలో వ్యాధుల నివారణలో సహాయపడతాయని ప్రపంచ పప్పు దినుసుల ప్రాధాన్యతను చెప్పడమే నేటి ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

2.250 కిలోల గంజాయి స్వాధీనం : ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి-వాల్మీకిపురం : గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన ఆదివారం మధ్యాహ్నం వెలుగులోకి చోటు చేసుకుంది. సిఐ ప్రసాద్ బాబు కథనం మేరకు.. పట్టణ శివారు ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్నారని అందిన రహస్య సమాచారంతో.. పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసులను చూసిన అక్రమార్కులు పరుగులు తీయడంతో పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి, నిందితులను పట్టుకున్నారు. గంజాయి వాసన ఘాటుగా వస్తుండడంతో తహశీల్దార్, వీఆర్ఓల సమక్షంలో నిందితుల వద్ద ఉన్న సంచులను తనిఖీ చేయగా అందులో 2.250 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. పట్టణంలోని చౌకలబండవీధికి చెందిన కలపల్లి అంజయ్య ఇందిరమ్మ కాలనీకి చెందిన సయ్యద్ ఖలీల్, దయ్యాలబండవీధికి చెందిన ఎస్‌కే, కత్తి సిద్దార్థ, నమాజ్‌కట్టవీధికి చెందిన నిమ్మనపల్లి కిరణ్‌లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 5 సెల్ ఫోన్లు, రూ.20వేల నగదు సీజ్ చేసి, రిమాండ్ నిమిత్తం సోమవారం కోర్టుకు హాజరుపరిచినట్లు సిఐ ప్రసాద్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎవరైనా అక్రమ రవాణాలు చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రశేఖర్, ఎఎస్ఐ కరీముల్లా, హెడ్‌కానిస్టేబుల్ దస్తగిరి, సిబ్బంది లక్ష్మీపతి, మధు, అబ్బుల్, రెడ్డి ప్రసాద్, అనిత, బాలాప్రసాద్, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

నిందితులను చూపుతున్న సిఐ ప్రసాద్ బాబు

రాజశ్రీ రాయచోటి సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

H.M.O.P. No. 41/2024

షెట్టిపల్లి కొండారెడ్డి, S/o వెంకటరెడ్డి, సాకిన్ డోర్‌నెం.136, వీధి నెం.810, బోసునగర్, రాయచోటి టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా. ...పిటీషనరు

Vs

ఓరుగంటి భారతి, W/o షెట్టిపల్లి కొండారెడ్డి, D/o వి.రాజారెడ్డి, వెంకటరెడ్డిగారిపల్లి, H/o బండపల్లి గ్రామం, రామాపురం మండలం, సాకిన్ డోర్‌నెం.38/113-3, జండామానువీధి, మా సాపేట గ్రామము, రాయచోటి టౌన్ & మండలం, అన్నమయ్య జిల్లా. ...రెస్పాండెంటు

ప్రకటన

పై దావాలోని పిటీషనరు రెస్పాండెంటు అయిన నీ పైన విడాకులు తీసుకొనుటకు గాను దావా దాఖలు చేసియున్నారు. నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 19.2.2025వ తేదిన ఉదయం 10.30 గంటలకు సదరు కోర్టులో హాజరు అయి నీ యొక్క ఆక్షేపణ తెలుపుకొనవలెను. లేనియెడల నీ పరోక్షమున తీర్మానించబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

//By Order of the Court//

ఎస్.ప్రభాకర్ రెడ్డి,
ఎమ్. ఇలియాజ్
అడ్వకేట్స్,
రాయచోటి.

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రామాపురం : మంత్రిని సన్మానిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-చిన్నమండెం

అధికారులు ప్రజాదర్బార్ కార్యక్రమంలో వచ్చే సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు జిల్లా నలుమూలల నుంచి ఎన్నో వ్యయప్రయాసలకోర్చి తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజాదర్బార్ కార్యక్రమానికి వస్తుంటారని అధికారులు బాధితుల సమస్యల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి వారికి న్యాయం చేయాలన్నారు. గతంలో ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి నియోజకవర్గంలో ఆయా ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రజాదర్బార్ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందన్నారు. రాయచోటి నియోజకవర్గంలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని వీటి పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి మంత్రి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

షూటింగ్ బాల్ విజేతను అభినందించిన మంత్రి

రాయచోటి : తంబళ్లపల్లెకు చెందిన షేక్ మహమ్మద్ యూసుఫ్ నేపాల్‌లో ఈ నెల 1, 2, 3వ తేదీలలో ఇండియా పాకిస్తాన్‌పై జరిగిన షూటింగ్ బాల్‌లో ఇండియా తరపున ఆడి గెలుపొందారు. సోమవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సారి షూటింగ్ బాల్‌లో గోల్డ్ మెడల్ సాధించిన మహమ్మద్‌ను అభినందించారు. ఇండియా తరపున మరిన్ని క్రీడా పోటీల్లో పాల్గొని మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి

రామాపురం : నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా చూడాలని మంత్రి పేర్కొన్నారు. మండలంలోని బండపల్లి పంచాయతీ వెంకటరెడ్డిగారిపల్లెలో సిమెంట్ రోడ్డును ఆయన సోదరుడు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు అనంతరం నేషనల్ హైవేలో తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని అధిక సంఖ్యలో నమోదు చేపట్టాలన్నారు. పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి నాయకుల నుంచి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గం గతంలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోక ఎంతో వెనకబడి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజవర్గంలో డ్రెయినేజీ కాలువలో తాగునీటి పరిష్కారం కోసం బోర్లు వేసి, వీధి లైట్లు ఏర్పాటు చేసి, ప్రతిగ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కరుణాకర్ రెడ్డి మాజీ మార్కెట్ చైర్మన్ రమేష్ రెడ్డి మాజీ జడ్పిటిసి నాగ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి, సురేందర్‌రెడ్డి, సహదేవరెడ్డి, రాంబసిరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, శివారెడ్డి, శివశంకర్ రెడ్డి, హరినాథ్‌రెడ్డి, బయ్యారెడ్డి, రెడ్డిబాబు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతి రైతూ 'ఫార్మర్ రిజిస్ట్రీ' చేసుకోవాలి : ఎఓ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

సొంత భూమి ఉన్న ప్రతి రైతూ 'ఫార్మర్ రిజిస్ట్రీ' చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సమన్వయంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ 'ఫార్మర్ రిజిస్ట్రీ' ద్వారా రాష్ట్రంలోని భూమిగల ప్రతి రైతుకు 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇస్తుందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేయడంతో వ్యవసాయ సేవలను సులభతరం చేసి, పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి రైతుకు ఆధార్‌కార్డు సంఖ్య తరహాలో ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నామన్నారు. భవిష్యత్తులో భూ ఆధారిత పథకాలైన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంట బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, తదితర పథకాలను ప్రభుత్వం నుంచి పొందేందుకు వీలు కలుగుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే సత్వరం రైతు పరిహారం పొందేందుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య తోడ్పడుతుందన్నారు. వ్యవసాయ సాగులో అధికారుల సూచనలకు ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్టరీ పోర్టల్‌లో నమోదు చేసిన తరువాత స్వంత భూమి గల ప్రతి రైతుకు కేటాయించబడే ప్రత్యేక గుర్తింపు సంఖ్యన్నారు. ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందటానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందన్నారు. రైతులు ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్, పట్టాదార్ పాసు పుస్తకంతో రైతు సేవ కేంద్రంలోని సిబ్బందిని సంప్రదించి పోర్టల్‌లో రిజిస్ట్రీ చేయించుకొని ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు. ఇతర కారణాలతో గ్రామంలో అందుబాటులో లేని రైతులు వారి రైతు సేవ కేంద్రం సిబ్బందిని ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలను నమోదు చేయించుకోవచ్చన్నారు. సొంత భూమి కలిగిన ప్రతి రైతు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను పొంది, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి కోరారు.

మదనపల్లె అర్బన్ : వ్యవసాయ శాఖ ద్వారా పట్టదారులైన రైతుల వివరాలు అగ్రి స్టాక్ ఎపిఎఫ్ఆర్ (ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ) పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని, అలా నమోదు చేసుకున్న రైతులకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేస్తారని మండల వ్యవసాయ శాఖ అధికారి నాగప్రసాద్ తెలిపారు. ఎపిఎఫ్ఆం సంఖ్య ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే వివిధ సంక్షేమ పథకాలు, పీఎంకిసాన్, ప్రభుత్వ రాయితీలు, ఎరువులు, విత్తనాలు, సూక్ష్మ సేద్యం, రైతు రుణాల మంజూరు మొదలైన పథకాలకు వాటికి అనుసంధానం చేస్తారన్నారు. ఈ రిజిస్ట్రేషన్ కొరకు రైతు స్వయంగా వచ్చి ఆధార్ ఇకెవైసి ద్వారా నమోదు చేసుకోవలసి ఉంటుందన్నారు.

జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో 'రాజు' విద్యార్థి ప్రతిభ

రాజంపేట : విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజు పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న తోకల భవేశ్ జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో ప్రథమ బహుమతిని సాధించి సత్తా చాటాడు. దీంతో సోమవారం పాఠశాల సిఇఒ గుంటిమడుగు రఘురామరాజు, ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, అకడమిక్ ఇన్ ఛార్జ్ హబీబ్ విద్యార్థిని అభినందించి ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందచేశారు. ఈ సందర్భంగా రఘురామరాజు, మోహన్‌రెడ్డి, హబీబ్ మాట్లాడుతూ అబాకస్‌లో ప్రతిభ చూపితే గణితంపై మంచి పట్టు సాధించవచ్చన్నారు.మెదడు కూడా చురుకుదనంతో పనిచేస్తుందని, అందువల్ల చదువులో కూడా బాగా రాణించగలరని తెలిపారు. విద్యార్థులు అబాకస్‌పై శిక్షణ పొందితే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. విద్యార్థులందరూ బాగా చదివి అన్ని పరీక్షల్లోను మంచి మార్కులు తెచ్చుకొని ఎంతో కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రులకు సంతోషాన్ని, మంచి పేరు తెచ్చిపెట్టాలని ఆకాంక్షించారు.

నందలూరు : విశ్వం ఎడ్యుటెక్ సొల్యూషన్ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 తేదీన విజయవాడలో నిర్వహించిన అబాకస్ వేదిక మ్యాథమెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీలలో నందలూరులోని జ్ఞాన దీప్తి ఆంగ్ల మాధ్యమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అబాకస్ సీనియర్ లెవెల్ కేటగిరిలో షేక్ మహమ్మద్ ఇబ్రహీం రెండవ స్థానాన్ని, వేదిక్ మ్యాథమెటిక్స్ పోటీలలో సయ్యద్ తెహజీబ్ వాల్యూం ఐదవ కేటగిరీలో మూడవ స్థానంలో నిలువగా, షేక్ ఫైజా వాల్యూమ్ 3 కేటగిరీలో మూడవ స్థానంలో నిలచింది. రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ ఘనపరిచిన విద్యార్థులను జ్ఞాన దీప్తి ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ అద్దంకి జానకినాథ్, ప్రిన్సిపల్ లక్ష్మమ్మ , ఉపాధ్యాయులు అభినందించారు.

నందలూరు : సర్టిఫికెట్లు, మెమోంటోలతో విద్యార్థులు

భూ సమస్యలపై దృష్టి సారించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మాట్లాడుతున్న ధనుంజయులు

మండలంలో నెలకొన్న రైతు సమస్యలు, భూ సమస్యలపై దృష్టి సారించాలని విఆర్వోలు, రెవెన్యూ సిబ్బందికి మదనపల్లె తహశీల్దార్ ధనంజయలు ఆదేశించారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో గతంలో అందిన భూ ఫిర్యాదులతో పాటు ప్రస్తుతం అందుతున్న ఫిర్యాదులను సత్వరమే పురస్కరించాలన్నారు. ముఖ్యంగా భూమి తగాదాలను పరిష్కరించాలని, రైతులు, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. ఇందులో భాగంగా పొన్నీటిపాలెం పంచాయతీ, బంగారు కొత్తపేట వాసులు కొన్ని దశాబ్దాలుగా తమ పల్లెకు దారి సమస్య ఉందని, దీనిపై పలుమార్లు అధికారులకు అర్జీలు అందజేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని, ఇప్పటికైనా దారి సమస్యను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన ఒకటి, రెండు రోజులలో సంబంధిత విఆర్ఒ, సర్వేయరును పంపించి దారిసమస్య పరిష్కారానికి కృషిచేస్తానని హామీఇచ్చారు.

కృష్ణంపల్లి పాఠశాలను హరితవనంలా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి పంచాయతీ లోని కృష్ణంపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కు మండల విద్యాశాఖ అధికారి శ్రీ చక్రధరరాజు విచ్చేసి పాఠశాల ఆవరణలో వివిధ రకాల పండ్ల మొక్కలను నాటడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థి అయిన యలమనేని చిన్న వెంగమ్మ కుమారుడు యలమనేని. రమేష్ (అమెరికా) దాదాపు రూ.60 వేలు వెచ్చించి పాఠశాల ఆట స్థలమంతా కూడా మట్టి తోలించి చదును చేయించి విద్యార్థుల శారీరక, మానసిక ఉల్లాసం కోసం తోడ్పడినందుకు అతనికి ధన్యవాదాలు చెప్పడం జరిగింది. యలమనేని రమేష్ మాట్లాడుతూ నేటి తరం పిల్లలంతా కూడా సెల్ ఫోనులలో గేమ్స్ ఆడుకుంటూ వారంతా మానసికంగా బలహీనులవుతున్నారని నేటి విద్యార్థులను ఆటపాటలతో శారీరకంగా మానసికంగా ద ృఢంగా తయారు చేయడం కోసం ఈ విధంగా తమ రుణం తీర్చుకున్నానని చెప్పడం జరిగింది. పాఠశాల ఆవరణమంతా పచ్చని మొక్కలు పెంచితే అవి భావితరాలకు మంచి చేస్తాయనే ఉద్దేశంతో బొక్కసం. ఆర్కే(లాయర్) ఆధ్వర్యంలో 23 రకాల పండ్ల మొక్కలు దాదాపు పదివేల రూపాయలు వెచ్చించి సహకరించినటువంటి దాతలు బొక్క సం ఆర్కే, సోమ రామచంద్రయ్య, సూరినేని రవీంద్ర యాదవ్, వీసం లోకేశ్వర్ రెడ్డికి పాఠశాల చైర్మన్ పసుపులేటి రవి ధన్యవాదాలు చెప్పడం జరిగింది. పాఠశాల పూర్వ విద్యార్థి అయిన బొక్కసం ఆర్కే మాట్లాడుతూ మేము మా పాఠశాలను, మా గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి ఎల్లప్పుడూ ముందుం టామని తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు సివి.రమణమూర్తి సహోపాధ్యాయులు ఎన్.విశ్వనాథ్ పాఠశాలకు సహకరించిన దాతలు అందరికీ ధన్యవాదాలు చెప్పడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల కో-ఆప్టెడ్ మెంబర్ యనమల సుబ్బ య్య, అంగన్వాడీ టీచర్ చంద్రమ్మ, నారే రమేష్, నారే. వెంకటసుబ్బయ్య ,నారే సుబ్బరాయుడు, తోట సులోచన, షేక్ పాపుల్ సాహెబ్, తోట వెంకటేష్, తోట రవయ్య పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న మండల విద్యాశాఖ అధికారి

పేరు మార్చబడినది

అన్నమయ్య జిల్లా, గాలివీడు మండలం, డోర్‌నెం. 8/7, పెద్దూరు, షేక్ ముంతాజ్‌బేగం, భర్త షేక్ జాఫర్‌వలి అయిన నాకు చెందిన ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ **K4185163**లో షేక్ ముంతాజ్‌గా వున్న నా పేరును షేక్ ముంతాజ్‌బేగం, భర్త షేక్ జాఫర్‌వలిగా మార్చుకుంటున్నాను. ఇక నుంచి నా ఒరిజినల్ పాస్‌పోర్టు నందు నా పేరు షేక్ ముంతాజ్‌బేగం.

CHANGE OF NAME

I, SHAIK MUNTAJ BEGAM, W/o Shaik Jafarvali, #8/7, Pedduru, Galiveedu Mandal, Annamayya District, AP. do here by changed my Name in Original Passport No.K4185163 as SHAIK MUNTAJ BEGAM (NEW NAME). Hence forth that now SHAIK MUNTAJ BEGAM in My Passport.

గర్భిణీలకు అన్నం వడ్డిస్తున్న ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి

గర్భిణులకు అన్నదానం

ప్రజాశక్తి- వీరబల్లి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, తనయుడు విష్ణురెడ్డి సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ప్రతి నెలా గర్భిణులకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్న ఉద్దేశంతో కార్యక్రమం చేస్తున్నామన్నారు. మండలంలోని దాతలు ఇలాంటి కార్యక్రమాలు చేయాలని కోరారు. ఎటువంటి ఆటంకాలు రాకుండా ప్రజలకు సేవ చేయడం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు. డాక్టర్ జియా ఉల్లా మాట్లాడుతూ మనకు ఏదైనా మంచి జరిగి వచ్చిన సంపాదనతో ముందుగా తల్లిదండ్రులకు ఖర్చు చేయడం సహజమని, కానీ విష్ణు రెడ్డి ఎంతోమంది గర్భిణులకు భోజన సదుపాయం కల్పించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు తారకేశ్వర్‌రెడ్డి, వైద్య సిబ్బంది, మండల నలుమూల నుంచి గర్భిణులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో 'శ్రీసాయి' విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి- రాయచోటి

పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో మూడవ సంవత్సరం మొదటి సెమిస్టర్ విద్యార్థులు, యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచారని విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి తెలియజేశారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో షేక్. హుమేరా 84.5 శాతంతో మొదటి ర్యాంకు , షేక్ మూలింటి సబీహా 83.1 శాతంతో రెండవ ర్యాంకు, పటాన్ బరేరా ఇన్సాఫ్ 82.1 శాతంతో మూడవ ర్యాంకు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం నుంచి సయ్యద్ సనా సాజియా 93.11 శాతంతో మొదటి ర్యాంకు, కతీబ్ జుబేరియా తస్లీమ్ 90.00 శాతం తో రెండవ ర్యాంకు, పటాన్ ముస్కాన్ 89.46 శాతం తో మూడవ ర్యాంకు సాధించి యూనివర్సిటీ స్థాయిలో అగ్రగామిగా నిలిచారని తెలిపారు . ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను అభినందిస్తూ, ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి భరోసా కల్పించడానికి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ఇంజినీరింగ్ కళాశాలలో అమలు చేస్తున్న అకాడమిక్ ఫలితాలను ప్రామాణికంగా చేసుకొని నాక్ బి ప్లస్ గ్రేడ్ గుర్తింపు రావడం గర్వకారణం చెప్పారు. యుజిసి అటానమస్ ప్రక్రియను వేగవంతం చేశామని తద్వారా ఆధునిక శాస్త్ర సాంకేతిక అంశాలు విద్యార్థిని విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకితభావంతో కృషి చేయాలని, క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి శుభహాన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగాధిపతి కరుణాకర్, అధ్యాపకులు అభినందించారు.

అర్జీలకు పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - వీరబల్లి

మండలంలో రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపాలని ఫార్మర్ రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ రాజశేఖర్ రాజు తెలిపారు. నూతనంగా వీరబల్లి తహశీల్దార్ ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వెంకటేష్‌కు బొకే అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సదస్సులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రతి గ్రామం నుంచి రెవెన్యూ సదస్సులో150 అర్జీలు రైతులు ఇచ్చారన్నారు. భూములు పట్టా ఉండి, భూమి రైతు స్వాధీనంలో ఉండి కూడా వన్ బీ, అడంగల్ రావట్లేదు అన్నారు. ఒక రైతు భూమి మరో రైతు పేరు మీద ఆన్‌లైన్ అయ్యాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఓదివీడు, సానిపాయి, గ్రామాల్లో రీ సర్వే వల్ల జాయింట్ ఎల్‌పి అధికంగా ఉన్నాయన్నారు. దీనివల్ల బ్యాంకు లోనూ రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రెవెన్యూ అధికారులు స్పందించి భూ రీ సర్వేలో వచ్చిన అర్జీలను పరిష్కారం చూపాలని కోరారు.

పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఇళ్ళు లేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలను ఇవ్వాలని, అర్హులైన పేదలందరికీ వ్యవసాయ భూమిని పంపిణీ చేయాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బికెఎంయు జిల్లా కార్యదర్శి కృష్ణప్ప, తంబళ్లపల్లె, మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, మురళి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఉన్న పేదలందరికీ గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు చొప్పున ఇంటి స్థలాలు, ఇంటి నిర్మాణ ఖర్చు రూ.4 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్న ఇప్పటి వరకు ఒక్క ఇంటి స్థలం కూడా ఇవ్వలేదన్నారు. తెలుగుదేశం నాయకులు తమ పార్టీ సభ్యత్వం తీసుకున్న వాళ్లకు మాత్రమే ఇంటి స్థలాలు ఇస్తామని, తమ కార్యకర్తలకు మాత్రం ఇండ్లు ఇచ్చే ప్రయత్నాలు చేస్తున్నారని, నిజమైన గ్రామీణ పేదలకు ఇళ్లను దూరం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం రాజకీయాలకతీతంగా అర్హులైన పేదలందరికీ ఇండ్లు ఇవ్వాలని కోరారు. సచివాలయాలపైన కూటమి నాయకులు పెత్తనం ఆపాలని, సచివాలయాలకు నిరుపేదలు స్వేచ్ఛగా వెళ్లి అర్జీలు ఇచ్చుకునే అవకాశం కల్పించాలని, సచివాలయాల పైన రాజకీయాలు చేయకూడదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిదో విడత భూ పంపిణీ నిర్వహించినప్పటికీ మదనపల్లి, తంబళ్లపల్లి నియోజకవర్గాలలో భూపంపిణీ చేపట్టలేదని, తక్షణమే భూ పంపిణీ చేపట్టి, అర్హులైన నిరుపేదలందరికీ వ్యవసాయ భూమిని రెండు ఎకరాలు చొప్పున పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు అంజనప్ప, తంబయ్య శెట్టి, నారాయణస్వామి, మల్లికార్జున, శంకర, మాధవ్, రెడ్డి, హరి, శంకరమ్మ, లక్ష్మీదేవి, నిజాం పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

ప్రజాశక్తి-పుల్లంపేట : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ మనోజ్ చంద్ర మరియు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజా ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. డాక్టర్ మనోజ్ చంద్ర స్థానిక ఎస్‌బివిడి సభ జూనియర్ కళాశాల మరియు బిపి శేషయ్య సంస్కృత ఉన్నత పాఠశాలలను సందర్శించి బాల బాలికలకు ఆల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల నమలగల మాత్రను ఏడాదికి రెండు సార్లు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఒక సంవత్సరం నుండి రెండు సంవత్సరాల వరకు గల పిల్లలకు సగం మాత్ర, రెండు నుంచి మూడు సంవత్సరాల మరియు 19 సంవత్సరాల వరకు పూర్తి మాత్రను పిల్లలు బాగా నమిలి మింగాలని తెలియజేశారు. రాష్ట్రంలో నులిపురుగుల వ్యాప్తి శాతం 34 శాతం ఉంటూ ప్రజారోగ్య సమస్యగా మారుతుందన్న వాటి నివారణ లక్ష్యంగా కృషి జరుగుతుందని పేర్కొన్నారు. మండల పరిధిలోని అంగన్వాడి, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో మొత్తం 7402 7229 మంది పిల్లలకు ఆల్బెండజోల్ 400 ఎంజి మాత్రను మింగించి 97 శాతం పూర్తి చేయడం జరిగిందని తెలియజేశారు. మిగిలిన 273 మంది పిల్లలకు మాప్ అప్ డే కార్యక్రమం ద్వారా లక్ష్యాన్ని పూర్తి చేయడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో సభ కళాశాల ప్రిన్సిపల్ అద్దేపల్లి బాలాజీ రాజు, సంస్కృత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరదరెడ్డి, సూపర్వైజర్లు మహేష్, సుబ్బారెడ్డి, శరత్చంద్ర, ఎఎన్ఎంలు లక్ష్మీదేవి, రాములమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీలేరు: ఆల్బెండజోల్‌తో పిల్లల ఆరోగ్యం సురక్షితమని జిల్లా ఆర్‌బిఎస్‌కె నిర్వహణ అధికారి డాక్టర్ శివప్రతాప్ తెలిపారు. "డి-వార్మింగ్" ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరైన ఆయన మాట్లాడుతూ పిల్లలకు మంచి అలవాట్లతో నులిపురుగుల బారిన పడకుండా తనను తాను ఎలా కాపాడుకోవాలో వివరించారు. ముడుపుల వేముల, బోడుమల్లువారిపల్లి పాఠశాలలు, అంగనవాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమం సఫలీకృతం కావడానికి ఆయన అక్కడి ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, ఎంఇఒ పద్మావతి, హెచ్ఇ కొండయ్య, ఎఎన్ఎం రేణుక, వసుంధర, సిహెచ్ఒ నాగముత్యం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.